సాక్షి అనంతపురం

గురువారం । 22 । మే । 2025



చీనీ టన్ను రూ.42 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.42 వేలు పలికాయి.



25న సివిల్స్ ప్రిలిమినరీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఈనెల 25న జరగనుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు.

8లో

గరిష్టం/కనిష్టం

35.7°/23.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మెగా సప్లిమెంటరీ ఫలితాలొచ్చేశాయ్



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ అధికారులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ మెగా సప్లిమెంటరీ (ఇయర్లీ వైజ్) ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత బుధవారం ఫలితాలను వెల్లడించారు. ఫలితాల కోసం జ్ఞానభూమి పోర్టల్‌లో చూడాలని సూచించారు. గతేడాది అక్టోబర్‌లో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ కోర్సుల్లో 99 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఏ, బీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలనూ విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, పీఆర్వో ప్రొఫెసర్ కే.రాంగోపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 24, 26వ తేదీల్లో బెంగళూరు జంక్షన్ (06589)లో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు బీదర్ జంక్షన్ చేరుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 23, 25, 27వ తేదీల్లో బీదర్ జంక్షన్ (06590)లో మధ్యాహ్నం 12.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు బెంగళూరు జంక్షన్‌కు చేరుతుందన్నారు. యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాహబాద్, కలబురిగి, హోమ్నాబాద్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 3-ఏసీ, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్‌లో నిర్వహించిన బీఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జి. నాగప్రసాద్ నాయుడు బుధవారం విడుదల చేశారు. ఫలితాలకు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ శంకర్ శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శింగనమల, నార్పల, అనంతపురం, రాయదుర్గం, శెట్టూరు, డీ.హీరేహాళ్, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కంబదూరు, ఉరవకొండ, విడపనకల్లు, బ్రహ్మసముద్రం, కణేకల్లు, పెద్దపప్పూరు, గుత్తి, యాడికి, కూడేరు, బుక్కరాయసముద్రం, వజ్రకరూరు, కుందుర్పి తదితర మండలాల్లో వర్షం పడింది. కాగా గురువారం కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?





మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శ్రీ సత్యసాయి జిల్లా జేసీ అభిషేక్ కుమార్, జెడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి, సమావేశంలో సమస్యలు లేవనెత్తుతున్న సభ్యులు

ఉమ్మడి జెడ్పీ సమావేశంలో సభ్యుల నిలదీత

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలో దయనీయ పరిస్థితులు
- అనంతపురం సర్వజనాస్పత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది ఇష్టారాజ్యం
- గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం
- చిన్న సమస్యతో సవీరాకు వెళ్లినా ఆపరేషన్లు, స్టంట్లు అంటూ ప్రాణాలతో చెలగాటం
- ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం ఏం చేస్తోందంటూ సభ్యుల ధ్వజం
- సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ రాజీనామా చేయాలని డిమాండ్

అనంతపురం సిటీ: 'విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పేదల ప్రాణాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించలేకపోతోంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు ధనదాహంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి' అంటూ జెడ్పీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా జేసీ అభిషేక్ కుమార్, సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, అనంతపురం,మడకశిర, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ముందుగా భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ సహా ఇతర సైనికుల ఆత్మ శాంతి కోసం మౌనం పాటించారు. ఆ తరువాత సభను చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనసాగించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ సహా అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, విడపనకల్లు, శెట్టూరు జెడ్పీటీసీ సభ్యులు జూటూరు చంద్రకుమార్, నీలం భాస్కర్, వాసల్లి హనుమంతు, మంజునాథ, వజ్రకరూరు ఎంపీపీ రమావత్ దేవి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాతో పాటు కడప, కర్నూలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల వారికి అనువైన అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సరిగా అందుబాటులో ఉండడం లేదన్నారు. కర్నూలు లేదా బెంగళూరుకు రెఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. వైద్యులు చాలా మంది ప్రభుత్వ సొమ్మును జీతంగా తీసుకుంటూ ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారన్నారు.సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అసమర్థత, నిర్లక్ష్యమే ఇందుకు కారణమని, కొన్నేళ్లుగా పాతుకుపోయి మామూళ్ల మత్తుకు అలవాటుపడి ఆస్పత్రి పరువు తీస్తున్నారని, వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖమంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇటీవల ఓ రోగిని అనంతపురం శివారులోని సవీరా ఆస్పత్రికి తీసుకెళ్లగా స్టంట్ వేయాలని, అందుకు రూ. లక్షలు ఖర్చవుతుందంటూ అక్కడి వైద్యులు తెలిపారని, అయితే రోగిని బెంగళూరుకు తరలించి టెస్ట్ చేయించగా ఎటువంటి ఆపరేషన్ అవసరం లేదని చెప్పారని సభ్యులు పేర్కొన్నారు. అవసరం లేకపోయినా ఆపరేషన్లు, స్టంట్లు వేస్తూ సవీరా యాజమాన్యం రోగులను దోచుకుంటోందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ, ఆ తరువాత వెళ్లిపోతుండటంతో అత్యవసర కేసులకు దిక్కులేకుండా పోతోందన్నారు. విడపనకల్లు మండలంలో తొమ్మిదేళ్ల బాలిక ప్రమాదానికి గురికాగా, ప్రాణాపాయ స్థితిలో స్థానిక పీహెచ్‌సీకి తరలిస్తే.. ఒక్కరంటే ఒక్కరూ అందుబాటులో లేరని జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు ఆరోపించారు. బళ్లారికి తరలించేలోపే చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ సవీరా ఆస్పత్రిలో జరిగే వ్యవహారాలపై కలెక్టర్ దృష్టి పెట్టాలని సూచించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సర్వజనాస్పత్రిలో పరిస్థితి గాడిన పడుతోందని, రోజూ 2 వేల నుంచి 2,500 వరకు రోగులు వస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జోక్యం చేసుకుంటూ పేదల ప్రాణాలతో చెలగాటమాడే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సర్వజనాస్పత్రితో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను కూడా రాత్రిళ్లు తనిఖీ చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓలను ఆదేశించారు. తాను ఇటీవల కొన్ని గిరిజన ప్రాంతాల్లో పర్యటించానని, దయనీయ పరిస్థితి ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు.

'ఉపాధి'లో భారీగా అక్రమాలు

ఉపాధి హామీ పథకం అమలులో విపరీతంగా అక్రమాలు జరుగుతున్నాయని సభ్యులు ఆరోపించారు. నిధులను ఎవరు మెక్కుతున్నారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సలీం బాషాను కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీలో అతిథి గృహాలు లేక మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలు అవస్థలు పడుతున్నారని కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు ఆవేదన వ్యక్తం చేయగా.. తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆర్డీటీకి నిధులు ఆగిపోకుండా చూడాలి

ఆర్డీటీకి నిధులు ఆపేయడం దుర్మార్గపు చర్యగా జెడ్పీ సభ్యులు అభివర్ణించారు. ఆర్డీటీ ఉనికి ప్రశ్నార్థకం చేయడమంటే పేదల ప్రాణాలను పణంగా పెట్టడమే అవుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ స్పందిస్తూ.. ఆర్డీటీకి పూర్తి స్థాయిలో నిధులు వచ్చేలా, భవిష్యత్తులోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా జెడ్పీ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందిస్తూ.. ఈ అంశాన్ని ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వివరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయమే వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఆర్డీటీకి నిధులు ఆగిపోవడంతో అక్కడి ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులు, ఇతర రోగులు పూర్తిగా ప్రభుత్వ ఆస్పత్రులపై ఆధారపడ్డారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలందించాలని కోరారు. వజ్రకరూరు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పని తీరుపై విచారణ జరిపి రెండు వారాల్లోగా తనకు నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవిని ఆదేశించారు. ఆస్పత్రుల్లో గ్రూప్-4 ఉద్యోగుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. నర్సులు, టెక్నీషియన్ల నియామకానికి నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. రెండు వారాల్లోపు ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న చిన్న పిల్లల స్పెషలిస్టులు, గైనకాలజిస్టులను ఇంటర్వ్యూల ద్వారా నియమిస్తామన్నారు.

హంద్రీ-నీవా, ఆర్డీటీ సమస్యలపై పోరాడతాం





మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ రెండు జిల్లాల అధ్యక్షులు అనంత, ఉషశ్రీ, నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, నేతలు

- రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడతాం
- ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'రాయలసీమ జిల్లాలకు కల్పతరువు లాంటి హంద్రీ-నీవా సామర్థ్యాన్ని తగ్గించి.. కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందికి అండగా ఉంటున్న ఆర్డీటీని కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రజలకు అన్యాయం జరిగే ఏ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నా.. దానిపై వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది' అని ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం అనంతపురంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం జరిగింది. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. హంద్రీ-నీవా, ఆర్డీటీ సమస్యలను జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీ చరణ్, సమన్వయకర్తలు రీజినల్ కో-ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధాన సమస్యలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా డైవర్షన్ పాలిటిక్స్ మినహా ప్రజలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటే.. ఇప్పుడు సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా సామర్థ్యాన్ని తగ్గించి, లైనింగ్ పనులను మొదలు పెట్టారన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో హంద్రీ-నీవా సామర్థ్యాన్ని పెంచేందుకు వీల్లేకుండా పోతుందన్నారు. రాయలసీమ ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 20 రకాల సమస్యలను తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం చంద్రబాబు తెర లేపారన్నారు. అందులో ఏ ఒక్క దాన్నీ నిరూపించలేకపోయారన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వ దుశ్చర్యలను గమనించాలన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. అరాచక పాలన చేస్తే ప్రజల నుంచి ఏదో ఒక రోజు తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు.

డైవర్షన్ కోసమే..

ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కూటమి ప్రభుత్వం మద్యం స్కాంను తెరపైకి తెచ్చిందని మిథున్‌రెడ్డి మండిపడ్డారు. దీనికి సంబంధించి ఒక్క రూపాయి కూడా సీజ్ చేయలేదన్నారు. రేషన్ షాపులను రద్దు చేస్తామంటూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతున్నామన్నారు. సమావేశంలో అనంతపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి, సమన్వయకర్తలు డాక్టర్ సాకే శైలజానాథ్, వై.వెంకటరామిరెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వర రెడ్డి, మెట్టు గోవింద రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఈరలక్కప్ప, దీపిక, మక్బూల్ అహ్మద్, మాజీ మంత్రి శంకర్ నారాయణ, వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డి, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధమవుదాం

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ పిలుపునిచ్చారు. అనంత మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కల్గిన నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. మునిసిపాలిటీ, సర్పంచ్ ఎన్నికలకు ఏడాది మాత్రమే గడువుందని, ఆ లోపు ప్రభుత్వ వైఫల్యాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుద్దామన్నారు. హంద్రీ-నీవా లైనింగ్ పనులను తక్షణం ఆపాలని, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి తీసుకెళ్లేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువద్దామన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించేలా పోరాడదామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అమరావతి జపం చేస్తూ.. రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. విభజన హామీల్లో జిల్లాకు మంజూరైన ఎయిమ్స్‌ను గతంలో మంగళగిరికి తరలించారని, ఇప్పుడు రూ.లక్ష కోట్లతో అమరావతిని నిర్మిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వీటిపై అందరూ కలసికట్టుగా పోరాడదామన్నారు. అనంతరం సమన్వయకర్తలు మాట్లాడారు.

మహాత్మా.. వారికి మంచి బుద్ధి ప్రసాదించు!



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

అనంతపురం సిటీ: మడకశిర, కళ్యాణదుర్గం, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు శాంతియుత నిరసన తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రధానమైన సమస్యలపై చర్చ జరుగుతున్న సందర్భంలో ముగ్గురు ఎమ్మెల్యేలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లోకి ఎటువంటి ముందస్తు అను మతి లేకుండా వెళ్లడమే కాకుండా దౌర్జన్యంగా వ్యవహరించిన తీరుపై జెడ్పీ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపినట్లు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు తెలిపారు. చైర్‌పర్సన్ చాంబర్‌లోకి వెళ్లి రచ్చ చేసి.. జాతిపిత మహాత్ముడి చిత్రపటాన్ని తొలగించి సీఎం చంద్రబాబు ఫొటో పెట్టడం, మాజీ సీఎం జగన్ ఫొటో పూర్తిగా తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఏదైనా అభ్యంతరం ఉంటే జెడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లకుండా.. అధికారం అండతో దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సీఈఓను ఏకవచనంతో దూషించడం దారుణమన్నారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా.. సమావేశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

ఎట్టకేలకు మొదలైన విత్తనశుద్ధి



ప్రాసెసింగ్ ప్లాంట్‌లో విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టారు. ఖరీఫ్ సమీపిస్తున్నా రైతుల కష్టాలు కూటమి సర్కారు పట్టించుకోవడం లేదని, వ్యవసాయశాఖ మొద్దు నిద్ర వీడటం లేదని 'సాక్షి'లో ఇటీవల వరుసగా కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో 40 శాతం మేర రాయితీ, అమ్మకం ధరలు ఇంకా అధికారికంగా ప్రకటించక మునుపే బుధవారం విత్తనశుద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా ఉన్న విజయా ఆగ్రోసీడ్స్ ప్లాంట్‌లో ఏడీఏ ఎం.రవి ఆధ్వర్యంలో విత్తనశుద్ధిని ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనం అందించడానికి వీలుగా ప్రాసెసింగ్ చేయాలని ఏడీఏ ఆదేశించారు. ప్రాసెసింగ్ పూర్తయిన వెంటనే ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేయాలని సూచించారు. జూన్ మొదటి వారంలో విత్తన పంపిణీ మొదలు పెట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ!

విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ వర్తింపజేసినట్లు సమాచారం. అలాగే క్వింటా విత్తన వేరుశనగ పూర్తి ధర రూ.9,300 ప్రకారం ఖరారు చేసినట్లు తెలిసింది. దీనిపై అటు వ్యవసాయశాఖ, ఇటు ఏపీ సీడ్స్ అధికారులు మాత్రం అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఇక.. కందులు, చిరుధాన్యాల ధరలు కూడా ఖరారు కాలేదు. జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తన కేటాయింపులు, ధరలు, రాయితీలు ప్రకటించి 15 రోజులు కావొస్తున్నా.. ఒక్క క్వింటా కూడా సరఫరా కాకపోవడం విశేషం.

మొత్తం ఖాళీలు 7,710

- టీచర్ బదిలీల ప్రక్రియ వేగవంతం
- 30న హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు
- జూన్ 4న స్కూల్ అసిస్టెంట్, 11న ఎస్జీటీలకు..

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేయడంతో జిల్లా అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు. హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేయనుండగా, ఎస్జీటీ కేడర్ టీచర్లను కూడా వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేసేలా షెడ్యూలులో పేర్కొన్నారు. అయితే మ్యానువల్‌గా నిర్వహిస్తారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రానుందని అధికారులు, సంఘాల నేతలు అంటున్నారు. ఇప్పటికే తప్పనిసరిగా బదిలీ అయ్యే హెచ్‌ఎంలు, టీచర్ల లెక్కలు తేల్చారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్-మండల పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ ఈ నాలుగు యాజమాన్యాల కింద జిల్లాలో మొత్తం 14,784 మంది అన్ని కేడర్ల టీచర్లు పని చేస్తున్నారు. ఆయా యాజమాన్యాల పాఠశాలల్లో ఏడు రకాల ఖాళీలను గుర్తించారు. మొత్తం 7,710 ఖాళీలను తేల్చారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 193, జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో 6,225, మునిసిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 231, మునిసిపల్ స్కూళ్లలో 1,061 ఖాళీలున్నట్లు గుర్తించారు.

ఏడు రకాల ఖాళీలు ఇలా...

అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 5/8 ఏళ్లు పూర్తయిన హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల ఖాళీలు 3,826 ఉన్నాయి. రీ-అపోర్షన్ ఖాళీలు 2,913, స్పష్టమైన ఖాళీలు 942, ఫారెన్ సర్వీస్ కింద వెళ్లడంతో ఏర్పడిన ఖాళీలు 5, బాలికల పాఠశాలల్లో పురుష టీచర్లు పని చేస్తూ ఏర్పడిన ఖాళీలు 02, వివిధ డిగ్రీలు చేసేందుకు సెలవులో వెళ్లిన టీచర్ల స్థానాల్లో ఏర్పడిన ఖాళీలు 19, అనధికార గైర్హాజరుతో ఏర్పడిన ఖాళీలు 3 ఉన్నట్లు వెల్లడైంది.

బదిలీల షెడ్యూలు ఇలా...

హెచ్‌ఎంల బదిలీలకు సంబంధించి గురువారం ఆన్‌లైన్ దరఖాస్తు, పరిశీలన, 24న ప్రొవిజనల్ సీనియార్టీ జాబితా, 25న అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. 26న అభ్యంతరాల పరిష్కారం, 27న ఫైనల్ సీనియార్టీ జాబితా విడుదల, 28న వెబ్ ఆప్షన్స్, 30న బదిలీల ఉత్తర్వులు జారీ చేస్తారు. అదేరోజు స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంల పదోన్నతుల వెబ్ ఆప్షన్, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వీరికి 31న పదోన్నతల ఉత్తర్వుల జారీ ఉంటుంది.



బదిలీల షెడ్యూలుపై సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు సంబంధించి...

24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు. 25-దరఖాస్తుల పరిశీలన. 26,27 తేదీల్లో ప్రొవిజనల్ సీనియార్టీ జాబితా ఆన్‌లైన్ ప్రదర్శన, 28న అభ్యంతరాల స్వీకరణ, 28,29 తేదీల్లో అభ్యంతరాల పరిష్కారం, 31న ఫైనల్ జాబితా ప్రకటన, జూన్ 1,2 తేదీల్లో వెబ్ ఆప్షన్, 4న బదిలీ ఉత్తర్వుల జారీ. 05న ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులకు వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్, 06న పదోన్నతుల ఉత్తర్వుల జారీ.

ఎస్జీటీ కేడర్‌కు సంబంధించి...

ఈనెల 27 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు. 28-దరఖాస్తుల పరిశీలన. 31న ప్రొవిజనల్ సీనియార్టీ జాబితా ఆన్‌లైన్ ప్రదర్శన, జూన్ 01న అభ్యంతరాల స్వీకరణ, 01,02 తేదీల్లో అభ్యంతరాల పరిష్కారం, 06న ఫైనల్ జాబితా ప్రకటన, 07 నుంచి 10 వరకు తేదీల్లో వెబ్ ఆప్షన్, 11న బదిలీ ఉత్తర్వుల జారీ. వీరికి మ్యానువల్ కౌన్సెలింగ్ ఉన్నా ఈ షెడ్యూలు మేరకే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

జంట హత్యల కేసులో మరొకరు లొంగుబాటు

రాప్తాడు: జంట హత్యల కేసులో ఆరుగురు నిందితుల అరెస్టు తర్వాత.. తాజాగా మరొకరు కోర్టులో లొంగిపోయారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న రాప్తాడు మండలం గొల్లపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులపై టీడీపీ కార్యకర్తలు వేట కొడవళ్లు, కట్టెలతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి, మృతుడు నారాయణరెడ్డి కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ప్రత్యేక బృందాలతో వేట ప్రారంభించడంతో ఈ నెల 19న ఆరుగురు నిందితులు రాప్తాడుకు చెందిన పామల్ల ధనుంజయ, పామల్ల ఇంద్రశేఖర్, నీరుగంటి నిరంజన్‌రెడ్డి, దండు నరేంద్ర, గంగలకుంటకు చెందిన బుడగ లక్ష్మీనారాయణ, అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన దయ్యం హన్మంత్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ నెల 20న వారిని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక పోలీసుబృందాలు గాలిస్తున్నాయి. హత్య జరిగిన సమయంలో గాయపడిన పామాల కొండప్ప అనే నిందితుడు అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిగిలిన నలుగురు నిందితులు మొబైల్ ఫోన్లు స్విచాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన బాల నరసింహారెడ్డి బుధవారం కోర్టులో లొంగిపోయాడని సీఐ శ్రీహర్ష తెలిపారు. కోర్టు ఉత్వర్వుల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితులు రాప్తాడుకు చెందిన పామల్ల పండయ్య, పామాల్ల కొండప్ప, గొనిపట్ల శీనా, పాత్రికేయుడు గొల్లపల్లికి చెందిన పెద్దింటి జగదీష్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

రాయదుర్గం విద్యార్థినికి 'షైనింగ్ స్టార్' అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని అక్షయ

రాయదుర్గంటౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 587/600 మార్కులతో ప్రతిభ కనబరచిన రాయదుర్గం కేజీబీవీ విద్యార్థిని ఎస్.అక్షయ 'షైనింగ్ స్టార్' అవార్డుకు ఎంపికయ్యింది. బుధవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డును అక్షయ అందుకుంది. గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేసి కేజీబీవీ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తోపాటు విద్యార్థిని తల్లిదండ్రులు గంగమ్మ, మల్లికార్జునలను అభినందించారు.

● కలెక్టరేట్ మినహాయింపు కాదు కదా?!

అనంతపురం అర్బన్: 'ప్రభుత్వ కార్యాలయాల్లో కాలం చెల్లిన వాహనాలు, నిరుపయోగంగా ఉన్న సామగ్రిని వేలం వేయాలి'' అని ఈ నెల 19న అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. వాస్తవానికి ఇతర కార్యాలయాల్లోని పరిస్థితి అటుంచితే... ఆయన ఆదేశాలు తొలుత కలెక్టరేట్ నుంచే మొదలుపెట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఎందుకంటే కండిషన్‌లో ఉన్న వాహనాలను సైతం మూలకు వేసి కొత్త వాహనాలను వినియోగిస్తుండడంతో చివరకు అవి గుజరీకి కూడా పనికిరాకుండా పోయాయి. నాలుగు జీపులు, ఆరు అంబాసిడర్ కార్లు, ఒక సుమో, ఒక చవర్లెట్ ఐవరీ కారు ఇలా మొత్తం 12 వాహనాలు 'తుక్కు'గా మారాయి. అలాగే కొత్త ఫర్నీచర్ వచ్చిందని అప్పటి వరకూ వినియోగించిన బీరువాలు, ర్యాక్‌లను ఆవరణలో పడేశారు. ఇందులో అత్యంత విలువైన స్టాంపింగ్ యంత్రం కూడా ఉంది. ఇవన్నీ ఎండకు ఎండి... వానకు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో ప్రక్షాళన అంటూ మొదలు పెడితే అది కలెక్టరేట్ నుంచే ప్రారంభం కావాలనే వాదన వినిపిస్తోంది. మరి ఆ దిశగా కలెక్టర్ చర్యలు చేపడతారో.. లేదో వేచి చూడాలి.



కలెక్టర్ కార్యాలయం వెనుక పార్కింగ్ చేయడంతో పనికిరాకుండా పోయిన వాహనాలు



తుప్పు పట్టిన టేబుళ్లు, బీరువాలు, ర్యాకులు



బయటపడేసిన విలువైన స్టాంపింగ్ యంత్రం, బీరువాలు

సబ్సిడీ బియ్యం పట్టివేత



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

రాప్తాడు: ప్రభుత్వం పేద ప్రజలకు సబ్సిడీపై అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు 65 క్వింటాళ్ల (140 బ్యాగులు) పీడీఎస్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని బంగారు పేటకు లారీలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. బియ్యం లోడుతో వెళ్తున్న లారీని విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, ఏఈఈ రవీంద్రనాథ్, సీఎస్‌డీటీ జ్యోతి తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని గొల్లపల్లి దగ్గర లారీని ఆపి తనిఖీ చేశారు. బిల్లులు, రసీదులు లేకుండా తరలిస్తున్న 65 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రాప్తాడు సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌కు తరలించారు.

అద్దె బస్సులపై ఆరా

- ఆర్టీసీ అధికారులు కళ్లు మూసుకున్నారా!
- ఏటా ఎంత నష్టమొచ్చిందో లెక్కలు తేల్చండి
- అద్దెబస్సుల టోల్ రాయితీ లెక్కగట్టే పనిలో విజిలెన్స్'
- 2,788 అద్దెబస్సుల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు
- నెలవారీ సమీక్షలో ఆరా తీసిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ అద్దె బస్సుల వివరాలు	
జోన్1- విజయనగరం	436
జోన్2-విజయవాడ	663
జోన్3- నెల్లూరు	556
జోన్4-కడప	1133
మొత్తం	2,788

అనంతపురం క్రైం: ఆర్టీసీలో అద్దె బస్సుల టోల్ చెల్లింపు రాయితీలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారంపై ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. బుధవారం విజయవాడ బస్ భవన్‌లో నిర్వహించిన నెలవారీ సమీక్షలో అనంతపురం రీజియన్‌లో అద్దె బస్సుల టోల్ రాయితీ వ్యవహారం హాట్ టాపిక్‌గా నిలిచింది. సమీక్షకు హాజరైన అనంతపురం రీజియన్ సిబ్బంది, అధికారులు, యూనియన్ నేతల ద్వారా అత్యంత విశ్వసనీయ సమాచారం ఇలా ఉంది... మంగళవారం 'ఆర్టీసీలో అధికారులే టో(తో)లు తీశారు..'అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సుల జాబితాను పరిశీలించాలని సూచించారు. డిపోల వారిగా అద్దె బస్సులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ టెండరు నిర్వహణలో ప్రతి అంశాన్నీ పరిశీలించాల్సిన ఈడీ, ఆర్‌ఎం క్యాడర్ అధికారుల తప్పిదం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని వివరించారు. అనంతపురం ఆర్టీసీ రీజియన్‌లో ఆరు నెలల క్రితమే ఈ విషయం బయటకు పొక్కినా సదరు అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ఆరా తీసినట్లు తెలిసింది. కార్పొరేషన్‌కు రోజువారీ వస్తున్న నష్టాన్ని పూడ్చాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. ఒక్క అనంతపురం రీజియన్‌లోనే సుమారు రూ.5 కోట్లు నష్టపోయినట్లు తేలితే రాష్ట్ర వ్యాప్తంగా ఆ నష్టం ఏమేరకు ఉంటుందో తక్షణం ఆరా తీయాలని సూచించినట్లు తెలిసింది.

అద్దె బస్సుల యజమానులకు నోటీసుల జారీ

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జోన్‌ల పరిధిలో 2,788 అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులు రోజువారీ ఎన్ని సింగిల్స్ తిరుగుతున్నాయి. ఎన్ని టోల్ గేట్లను దాటుకుని పోతున్నాయన్న దానిపై వివరాలు సేకరించాలని అకౌంట్స్ విభాగాలకు ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలందినట్లు సమాచారం. తక్షణం అద్దె బస్సులు స్థానిక జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఉంటే సదరు బస్సు యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఏదేమైనా ఇంత పెద్ద నష్టానికి కారకులైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? లేక సర్దుకుంటారా? అన్నది తేలాల్సి ఉంది.

టోల్ రాయితీ నష్టంపై విజి'లెన్స్'

అనంతపురం ఆర్టీసీ రీజియన్ పరిధిలో అద్దె బస్సుల టోల్ రాయితీ పొందలేక పోవడానికి ప్రధాన కారణం లోకల్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడమే కారణమని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు డిపోల వారీగా అద్దె బస్సుల వివరాలను సేకరించింది. ఈ మేరకు నివేదికను ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపింది. కాగా ఎంత మేరకు నష్టం జరిగిందన్న వివరాలను ఇంకా సేకరిస్తున్నామని ఆర్టీసీ విజిలెన్స్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో చెరువులను పూర్వస్థితికి తేవాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 507 చెరువులను పూర్వస్థితికి తేవాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణకు కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చిస్తాయని పేర్కొన్నారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఐ అండ్ ఎంసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వ నిధులతో శ్రీ సత్యసాయి జిల్లాలో 411 చెరువులు, అనంతపురం జిల్లాలో 96 చెరువులను పూర్వస్థితికి తీసుకురావడానికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. చెరువులను గుర్తించి పనులకు సంబంధించి ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీకి పంపించాలన్నారు. ఇప్పటికే 29 చెరువులను గుర్తించారని, మిగిలిన చెరువులను పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండమేరు పైభాగాన, మరువ వంక, నడిమి వంక పైభాగన ఉన్న చెరువులను కూడా బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, భూగర్భ జల శాఖ డీడీ తిప్పేస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, కేంద్ర భూగర్భజల బోర్డు అధికారి స్వరూప్ కళ్యాణ్, కేంద్రీయ జలసంఘం ఏడీ సీహెచ్ సంజీవ్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలు లేక మినీ మహానాడు వెలవెల

గార్లదిన్నె: మర్తాడు క్రాస్ కల్యాణ మండలంలో బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో శింగనమల నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. తొలుత ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఉదయమే వేదిక వద్దకు చేరుకున్నా ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా నేతలు మధ్యాహ్నం వరకు రాలేదు. దీంతో పార్టీ శ్రేణులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే, నాయకులు ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు లేక కుర్చీలు ఖాళీగా కనిపించాయి.



కార్యకర్తలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

25న సివిల్స్ ప్రిలిమినరీ

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ''యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్ష ఈనెల 25న జరగనుంది. ఏడు కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 2,546 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి. యూపీఎస్సీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రెండు సెషన్లుగా (పేపర్-1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు), (పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30) జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. పరీక్ష పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి ఎన్.యువరాజ్, యూపీఎస్సీ ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా ఆర్.కె. అవస్థీని నియమించారన్నారు. నిర్దేశించిన పరీక్ష సమయానికంటే గంట ముందే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ-అడిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించబోరని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం



మృతి చెందిన డ్రైవర్ జబ్బార్



స్వల్పంగా గాయపడిన పెళ్లికుమారుడు రాజేష్

గుత్తి రూరల్: అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొంది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో పెళ్లిబృందం కారును ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పెళ్లికుమారుడితో సహా ఆరుగురుగాయపడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రిలోని గాజులపాలెంకు చెందిన రాజేష్ వివాహం వజ్రకరూరులో గురువారం జరగనుంది. బుధవారం పెళ్లి కుమారుడు రాజేష్ బంధువులతో కలిసి ఇన్నోవా కారులో బయల్దేరారు. గుత్తి మండలం జక్కలచెరువు శివారు మలుపులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ఇన్నోవా కారును రాజస్థాన్ నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తాడిపత్రికి చెందిన కారు డ్రైవర్ జబ్బార్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పెళ్లి కుమారుడు రాజేష్‌తో పాటు బంధువులు ఉమాదేవి, సరోజ, ఎన్.శ్రీనివాసులు, నారాయణమ్మ, శ్రీనివాసులు గాయపడ్డారు. వీరిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉమాదేవి, నారాయణమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి పంపించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేష్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ దుర్మరణం



మహబూబ్‌బాషా (ఫైల్)

గుంతకల్లు: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ కార్యాలయ అటెండర్ షేక్ మహబూబ్‌బాషా (25) దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోమినాబాద్‌కు చెందిన ఖాజా, మున్నీ దంపతుల కుమారుడు మహబూబ్‌బాషా ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్ పని చేస్తున్నారు. ఇటీవలే డిప్యుటేషన్‌పై వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా బదిలీ అయ్యారు. రోజూ డ్యూటీకి ద్విచక్రవాహనంపై వెళ్లి వచ్చేవారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు బయల్దేరిన మహబుబ్‌బాషా మార్గమధ్యం కమలపాడు వద్ద వేగంగా వస్తున్న జీటో ఆటో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటో బోల్తా పడటంతో గుంతకల్లులోని హౌసింగ్ బోర్డుకు చెందిన అబ్దుల్ రజాక్, అతని కుమారుడు రోషన్ గాయపడ్డారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ఆస్పత్రికి వెళ్లి అటెండర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బహిరంగచర్చకు ముఖం చాటేసిన కాలవ

- హంద్రీ-నీవాపై మాట్లాడే దమ్ములేకే అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ధ్వజం
- ఉరవకొండకు రమ్మంటే జీడిపల్లికి రావాలంటూ మెలిక పెట్టిన కాలవ



ఉరవకొండలో హంద్రీ-నీవా శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కాలవ కోసం వేచిచూస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో.. ఏ ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించిందో అనే అంశంపై చర్చకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విసిరిన చాలెంజ్‌ను ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి స్వీకరించారు. బుధవారం ఆయన తన అనుచరులతో కలిసి ఉరవకొండలో ర్యాలీగా వెళ్లి క్లాక్‌టవర్ వద్దనున్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగ చర్చ కోసం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న హంద్రీ-నీవా శిలాఫలకాల ప్రాంగణం వద్దకు ఎమ్మెల్సీ తన అనుచరులతో వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు, అధికారులు తలుపులకు తాళం వేశారు. అయినా ఎమ్మెల్సీ వెనక్కు తగ్గలేదు. ప్రహరీ దూకి శిలాఫలకం వద్దకు చేరుకున్నారు. దాదాపు గంటకు పైగా వేచి చూసినా సవాల్ విసిరిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అక్కడకు రాలేదు. అనంతరం శివరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఉరవకొండకు రాకుండా కాలవ శ్రీనివాసులు జీడిపల్లి రిజర్వాయర్ వద్ద చర్చకు రావాలంటూ కొత్త డ్రామాకు తెరదీయడం హాస్యాస్పదంగా ఉందని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు మొదటి దశ పనులను మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పూర్తి చేసి, జీడిపల్లి వరకు నీటిని తీసుకెళ్లారని గుర్తు చేశారు. 40 టీఎంసీల సామర్థ్యమున్న ప్రాజెక్టును చంద్రబాబు హయాంలో కుదించడానికి చర్యలు చేపట్టడంతో పాటు నిధులు విడుదల చేయలేదని, తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక హంద్రీ-నీవాను 6,300 క్యూసెక్యులకు పెంచి, రూ.9,318కోట్లు మంజూరు చేశారని జీఓ కాపీలు చూపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవాను ఆదాయ వనరుగా భావించి 3,600 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువను వెడల్పు చేయడానికి శ్రీకారం చుట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు ఫోన్ చేసి బహిరంగ చర్చకు ఉరవకొండకు రావాలని ఆహ్వానించగా.. జీడిపల్లి వద్దకు రావాలని మెలిక పెట్టడం చూస్తే ఆయన సవాల్‌కు కట్టుబడి లేరని అర్థమైందని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు.


ఎమ్మెల్యేలా.. వీధిరౌడీలా?



మాట్లాడుతున్న పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జిల్లాపరిషత్ కార్యాలయంలో వీధి రౌడీల్లా ప్రవర్తించారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు విమర్శించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను తొలగించాలంటూ అధికారులపై హుకుం జారీ చేయడమేంటని ప్రశ్నించారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఎక్కడా లేదని పేర్కొన్నారు. అధికారులను బెదిరిస్తూ దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందనడానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యమని అభివర్ణించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

ఫొటోల కోసం పాకులాడటమేంటి?



వెన్నపూస రవీంద్రరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి మరచి ఫొటోల కోసం పాకులాడటం ఏంటని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చర్యలను ఆయన ఖండిస్తూ బుధవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించారన్నారు. జిల్లాలో హంద్రీ-నీవా, ఆర్టీటీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటిపై పాలకులు నోరు మెదపకుండా దిగుజారుడు రాజకీయాలకు పాల్పడడం ఏంటని నిలదీశారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారన్నారు. ఉపాధి హామీ పనుల అవినీతిపై చర్చ జరిపిన పాపాన పోలేదన్నారు. ఓ బీసీ మహిళా ప్రజాప్రతినిధి చాంబర్‌లోకి వెళ్లి హంగామా చేయడమే కాకుండా జెడ్పీ సీఈఓపై దబాయించడమేంటన్నారు.

పదోన్నతుల జాబితాలో మతలబు ఏమిటో?

- 2023లో హెచ్ఎంగా పదోన్నతి పొందిన ఫిజికల్ సైన్స్ టీచరు
- మూణ్నెళ్ల పాటు హెచ్ఎంగా పనిచేసి ఆయన ఇష్టం మేరకు రివర్షన్
- తిరిగి ఆప్పుడు పదోన్నతుల జాబితాలో చేర్చిన విద్యాశాఖ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పదోన్నతుల అంశానికి సంబంధించి ఎన్నిమార్లు నాట్ ఆప్టెడ్ (అయిష్టత) ఇచ్చినా... తర్వాత జరిగే కౌన్సెలింగ్‌లో వారి పేర్లను పెట్టొచ్చనేది నిబంధన. అయితే ఒకసారి పదోన్నతి పొంది ఆ కేడర్‌లో జీతం కూడా తీసుకుని తిరిగి వారి ఇష్టం మేరకు రివర్షన్ వచ్చిన వారికి తిరిగి పదోన్నతుల జాబితాలో చేర్చకూడదు. జాబితా తయారీలో పొరపాటు జరిగి ఉంటే సరిదిద్దుకోవాలి. ఎవరైనా అభ్యంతరాలు తెలిపిన తర్వాతనైనా ఆ తప్పును సరిదిద్దాలి. అయినా కొనసాగిస్తున్నారంటే మతలబు ఏమిటో.. ఈ రహస్యం విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులకే తెలియాలి.

ఇదీ అసలు కథ..

ఫిజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్న గుత్తా వెంకటనాయుడు 2023 జూలైలో ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి పొంది ఆత్మకూరు మండలం తోపుదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ సెప్టెంబరు వరకు పని చేశారు. తర్వాత వ్యక్తిగత కారణాల వల్ల తనకు రివర్షన్ (తిరిగి స్కూల్ అసిస్టెంట్‌గా) ఇవ్వాలని కోరడంతో అధికారులు రివర్షన్ ఇచ్చారు. ఈయన ప్రస్తుతం డి.హీరేహాళ్ మండలం 74-ఉడేగోళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఒకసారి రివర్షన్ ఇచ్చిన ఉపాధ్యాయులను తిరిగి పదోన్నతుల జాబితాలో పెట్టకూడదు. కానీ ప్రస్తుతం హెచ్ఎంల సీనియార్టీ జాబితాలో ఆయన పేరు చేర్చడం విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. హెచ్ఎంల ఫైనల్ సీనియార్టీ జాబితాలో 21 పేరుగా ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అభ్యంతరాలు తెలియజేసినా...

గుత్తా వెంకటనాయుడు పేరును నిబంధనలకు విరుద్ధంగా హెచ్ఎంల సీనియార్టీ జాబితాలో చేర్చారంటూ అభ్యంతరం చెబుతూ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జాబితాలో ఆయన వెనుక ఉన్న టీచర్లు విద్యాశాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాత్కాలిక సీనియార్టీ జాబితా సమయంలోనే ఫిర్యాదులు చేసినా ఫైనల్ జాబితా వరకు ఆయన పేరును కొనసాగిస్తుండడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. పదోన్నతి పొందిన టీచర్లు 15 రోజుల లోపు వెనక్కు వస్తే తిరిగి పదోన్నతి ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయంటున్నారు. మూణ్నెళ్ల తర్వాత వచ్చిన టీచరుకు తిరిగి పదోన్నతి కల్పించేందుకు అధికారులు లోగుట్టుగా కొనసాగిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోతే డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని టీచర్లు అంటున్నారు.

హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధనరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురము సెంట్రల్: హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్ధనరెడ్డి నియమితులయ్యారు. నంద్యాల జిల్లా ఎస్ఆర్ బీసీ ప్రాజెక్ట్ సర్కిల్ -1 ఎస్ఈగా పని చేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా గత నెలాఖరులో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ పొందారు. అయినప్పటికీ ఎస్ఈ నియామకం జరగక పోవడంతో ఈ నెల 13న 'ప్రగతి తప్పిన హెచ్చెల్సీ' శీర్షికన సాక్షిలో కథనం వెలువడటంతో ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) ఎస్ఈగా పురార్ధనరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

దౌర్జన్యమే మీ విధానమా?

- టీడీపీ నాయకులపై మేయర్ వసీం ధ్వజం



అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అభివృద్ధికి అడ్డుపడ్డారు. ఇప్పుడు ఏకంగా నా చాంబర్‌లో చొరబడ్డారు. దౌర్జన్యమే టీడీపీ నాయకుల విధానమా? కనీసం ప్రథమ పౌరుడికి ఇచ్చే గౌరవం ఇదేనా? ఇంకా పాలకవర్గం ఉన్నా .. అప్పుడు ఈ చేష్టలు ఏమిటి' అని మేయర్ వసీం ధ్వజమెత్తారు. మేయర్ చాంబర్‌లోకి టీడీపీ నాయకులు చొరబడడాన్ని ఆయన తప్పుబడుతూ బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా జెడ్పీలోనూ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి దూసుకెళ్లి హంగామా చేయడం ఏమిటని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందా? అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టేసి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేసుకోవాలంటే కమిషనర్‌ను కలవాలన్నారు. కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నాయకుల నైజం మరోసారి బహిర్గతమైందన్నారు.

టీడీపీ నాయకుల హల్‌చల్



మేయర్ వసీం చాంబర్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం ఫొటోలను పెడుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ చోటా నాయకులు రెచ్చిపోయారు. నిన్న మొన్నటి వరకు కాంట్రాక్ట్ పనుల పేరుతో నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేసిన నాయకులు సాకే లక్ష్మీనరసింహ, సరిపూటి శ్రీకాంత్ ఏకంగా నగరపాలక సంస్థలోకి చొరబడ్డారు. దౌర్జన్యంగా మూసి ఉన్న మేయర్ వసీం చాంబర్‌ను తెరిపించి మరీ ఓవరాక్షన్ చేశారు. మేయర్ వసీం లేని సమయంలో ఆయన చాంబర్‌కు వెళ్లారు. నగర ప్రథమ పౌరుడు (మేయర్) కుర్చీని పక్కకు తోసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ చోటా నాయకులు మేయర్‌ను అవమానపరిచారు. దురుద్దేశ్యపూర్వకంగా వారు ప్రవర్తించిన తీరును చూసి ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు. నగరపాలక సంస్థలో గట్టిగా అరుస్తూ అలజడి వాతావరణం సృష్టించారు.

స్నాతకోత్సవం విజయవంతంపై హర్షం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం 14వ స్నాతకోత్సవం విజయవంతం కావడంపై వీసీ ప్రొఫెసర్ హెచ్ సుదర్శనరావు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో స్నాతకోత్సవానికి హాజరు కావడంతో ప్రత్యేకత సంతరించుకుందని తెలిపారు. స్నాతకోత్సవ విజయానికి ప్రతి ఉద్యోగి సహకారం ఉందన్నారు. అందరి తోడ్పాటుతోనే విజయవంతమైందన్నారు. స్నాతకోత్సవాన్ని బాగా కవరేజీ ఇచ్చిన మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఎస్ .దేవన్న, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేష నాయుడు

ఆత్మకూరు: ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేష నాయుడు ఆలయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ పరిసర ప్రాంతాలు చెత్త చెదారంతో నిండి ఉన్నాయని.. వెంటనే శుభ్రం చేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఆలయ సమీపంలోని రథానికి షెడ్డు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేయకుండా భక్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

రేపు ద్విచక్రవాహనాల వేలం

అనంతపురం: నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 23వ తేదీన 18 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు సీఐ కే.సాయినాథ్ తెలిపారు. ఆసక్తి గల వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలం ముగిసిన తరువాత వేలం దక్కని వారికి రూ.3 వేలు డిపాజిట్ తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

నమో హనుమ.. సదా స్మరామి

- నేడు హనుమజ్జయంతి
- విద్యుద్దీపాలతో ముస్తాబైన ఆలయాలు
- మార్మోగుతున్న అఖండ రామనామస్మరణ



విద్యుత్ దీపాలతో ముస్తాబైన కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి ఆలయం



మారుతీ నగర్‌లో ఆంజనేయుడికి వడల హారం వేసిన భక్తులు

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే అంజనీ సుతుడికి ప్రీతికరంగా భావించే హనుమజ్జయంతి వేడుకలు గురువారం జరగనున్నాయి. నగరంలో సాగే ప్రత్యేక వేడుకలకు వాడవాడలా ఆంజనేయుడి ఆలయాలు విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబయ్యాయి. సుందరకాండ పారాయణం, సహస్రనాగవల్లి దళార్చన, శ్రీవత్సల సమేత హనుమంత కల్యాణం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. వివిధ ఆలయాల్లో విశేష అభిషేకాలు, ఆకుపూజలు, హోమాలు, గ్రామోత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే రామాలయాల్లో శ్రీరామ నామస్మరణ మార్మోగుతోంది. మూడు రోజుల వేడుకల్లో భాగంగా హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో సామూహిక రామనామస్మరణ జరిగింది. సోములదొడ్డి అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు మూలమూర్తికి సాగిన అభిషేకాలతో ఘనంగా జరిగాయి. జీసెస్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక పారాయణం, వడల హారం, ఆకుపూజలు పెద్ద ఎత్తున జరుగుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు. కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి, హెచ్చెల్సీ కాలనీలోని శ్రీ వలీస్వామి ఆశ్రమం, తపోవనంలోని శివశక్తి బాబా ఆలయం, ఇందిరా నగర్, మారుతీ నగర్ తదితర చోట్ల హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందు ధర్మప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 10 ఆంజనేయస్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో హిందూ ధర్మప్రచార మండలి ప్రతినిధి శ్రీపాద వేణు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు వివరాలు వెల్లడించారు. ఆకుపూజ, సుందర కాండ, చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. కళ్యాణదుర్గం రోడ్డు తారక నగర్‌లో ఉన్న నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు నిర్మలమురళీ వారు వివిధ పూజల కోసం రూ.10 వేలు, నిత్యావసర వస్తువులు అందించారు. గురువారం విశేష పూజలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని అందరూ విచ్చేయాలని కోరారు.

మాధవ్‌ను కలసిన మిథున్



మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పరామర్శించిన మిథున్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బుధవారం నగరంలోని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. కేసులో ఇటీవల రిమాండ్‌కు వెళ్లి వచ్చిన గోరంట్ల మాధవ్‌తో పలు అంశాలపై మిథున్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రులు శైలజనాథ్, శంకరనారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆలూరి సాంబశివారెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, పామిడి వీరాంజనేయులు, ఎల్ఎం మోహన్‌రెడ్డి, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, ధనుంజయ యాదవ్, సర్పంచులు చియ్యేడు గంగాధర రెడ్డి, తాటిచెర్ల అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డితో భేటీ



ఎంపీ మిథున్ రెడ్డితో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి, తదితరులు



ఎంపీ మిథున్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి



ఎంపీ మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డిని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వివిధ విభాగాల నాయకులు ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని ఎంపీ సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: నిత్య జీవితంలో యోగా భాగం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జూన్ 11న అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం అనంతపురం ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలోప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం కలెక్టర్ యోగాసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. యోగా మాస్టర్లు గురురాజారావు, కృష్ణవేణి యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ రాంకుమార్, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, డ్వామా పీడీ సలీమ్ బాషా, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



పౌర సరఫరాల సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్ల హమాలీలు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల లెవల్ స్టాక్ పాయింట్లలోని హమాలీలు బుధవారం పౌర సరఫరాల సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, కమిటీ సభ్యుడు ఆర్వీ నాయుడు మాట్లాడుతూ.. హమాలీలకు గత ఏడాది జనవరి నుంచి పెరిగిన వేతనం అమలు చేయడంతో పాటు అరియర్స్ చెల్లించాలన్నారు. ప్రతి ఏడాది దసరాకు ఇచ్చే బట్టలు, కుట్టు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి మూడు నెలల కిత్రం జీఓ 14 ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో అరియర్స్, బట్టలు ఇచ్చినప్పటికీ ఇక్కడి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమస్యలపై సంస్థ జిల్లా మేనేజర్‌కు నాయకులు వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. అరియర్స్ చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సమస్యలపై డీఎం రమేష్ రెడ్డి స్పందిస్తూ.. శనివారంలోపు అరియర్ చెల్లిస్తామని తెలిపారు. బట్టలు, కుట్టు కూలీ వచ్చే వారం ఇస్తామని చెప్పారు. ప్రతి నెల 15వ తేదీలోగా హమాలీలకు వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ స్వామి, శంకర్, మేస్త్రీలు నారాయణ స్వామి, ముని, ఇమామ్, అక్కులప్ప, నాగరాజు, రామచంద్ర, విజయ్, శీనా, రామాంజి, చిన్న హనుమంతు, హమాలీలు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో తప్పులు సవరించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియార్టీ జాబితాలో తప్పులను సరి చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. హెచ్ఎం సీనియార్టీ జాబితాలో చాలా తప్పులు దొర్లాయని.. అందుకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. గతంలో తాత్కాలిక సీనియార్టీ జాబితాలు ప్రకటించిన సమయంలోనే పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పదోన్నతుల షెడ్యూల్ లోపు తప్పిదాలన్నీ సవరించి కొత్త సీనియార్టీ జాబితాను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, హరిప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన



సర్వే సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ మహేష్

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురంలో జరుగుతున్న రీ సర్వే పనులను ధర్మవరం ఆర్డీఓ మహేష్ బుధవారం పరిశీలించారు. పనులను ఏవిధంగా చేస్తున్నారు? ఇప్పటి వరకు ఎంత వరకు పనులు పూర్తి చేశారని గ్రామ సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపు రీ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా రీ సర్వేను పక్కాగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సర్వే సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

బదిలీల్లో గోల్‌మాల్ జరిగితే చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో అవతవకలు జరిగితే చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. బుధవారం ఆయన వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎక్కడైనా అవతవకలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులు అందితే బదిలీ ఆర్డర్లు కూడా వెనక్కి ఇస్తామన్నారు. దళారుల ప్రమేయాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. త్వరగా విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే సీడ్ ప్రాసెసింగ్ మొదలు పెట్టాలన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీఎం పద్మావతి

ఆత్మకూరు: డ్వాక్రా సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పి.యాలేరు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. సంఘాల ద్వారా మహిళలకు అనేక విధాలుగా కోరినంత రుణాలు అందిస్తున్నామన్నారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఎంఎల్ఎం, పీఎంఈజీ వంటి పథకాల ద్వారా మహిళలకు రూ.పది లక్షల వరకూ రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకించి మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు ప్రారంభిస్తే తాము ఉపాధి పొందడంతో పాటు మరెంతో మందికి ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి పౌరాణిక నాటకోత్సవాలు

అనంతపురం కల్చరల్: అనంత రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటూ వివిధ పౌరాణిక నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం నిర్వాహకులు మైఖేల్ బాబు, అఫ్జల్, త్రిలోక్, నారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24 నుంచి 28 వరకు స్థానిక కృష్ణకళా మందిరం వేదికగా నాటకోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 24న శ్రీకృష్ణ రాయభారం పూర్తి నాటకం, 25న బాల నాగమ్మ పూర్తి నాటకం, 26న సత్యహరిశ్చంద్ర నాటకం, 27న పంచాకముల నాటక ప్రదర్శన, 28న జిల్లా రెవిన్యూ అధికారి ఆధ్వర్యంలో అనంత నాగ్ సంగీత్ స్వర్గ కల్చరల్ అసోసియేషన్ వారిచే సంగీత విభావరి ఉంటాయన్నారు. అనంత రంగ స్థలానికి విశేష సేవలందించిన కళాకారులకు ఎన్టీఆర్ పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కళాభిమానులు నాటకోత్సవాల్లో పాల్గొని కళాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.



వై.కొత్తపల్లి వద్ద కమ్ముకున్న మేఘాలు

మేఘమా.. మరువకే

గత నాలుగు రోజులుగా ఆత్మకూరు మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మండలంలోని వడ్డుపల్లి, పంపనూరు, వై.కొత్తపల్లి వద్ద ఉన్న కొండలను చుట్టేసినట్లుగా దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఓవైపు నల్లని మేఘాలు.. మరోవైపు పచ్చని పొలాలు, పక్కనే గాలిమరలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– ఆత్మకూరు:

వేధిస్తున్న నెట్‌వర్క్ సమస్య

కనగానపల్లి: మండలంలోని యలకుంట్ల గ్రామ సచివాలయంలో నెల కొన్న సాంకేతిక సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో ఆన్‌లైన్ సర్వరులో ఓపెన్ కావడం లేదు. దీంతో సచివాలయంలో రేషన్‌కార్డుల దరఖాస్తులు, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సచివాలయ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గంటల కొద్ది సచివాలయం వద్ద వేచి ఉన్నా పనులు జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

గుంతకల్లు: ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా కోరారు. బుధవారం గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయంలో యాంటీ టెర్రరిజంపై ఉద్యోగులతో డీఆర్ఎం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత పిచ్చితో ఉగ్రవాదులు చేసే దుశ్చర్యలకు అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఆర్పీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పక్షపాతి వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి

అనంతపురం సిటీ: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉపాధ్యాయ లోకానికి విశేష సేవలందించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి అన్నారు. తమ ఫెడరేషన్ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో వైఎస్ చూపిన తెగువ మరే ముఖ్యమంత్రి చూపలేదన్నారు. ఆయనకు ఉపాధ్యాయ లోకం రుణపడి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్, అల్తాఫ్ హుస్సేన్, అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శులు త్యాగరాజు నాయక్, శ్రీనివాసులు, నాగేంద్ర పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏపీఎస్ఎఫ్), ఇన్‌స్పైర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ సంస్థ వ్యవస్థాపకుడు ఆకుల రాఘవేంద్ర తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 550 మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయాలని నిర్ణయించామన్నారు. మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఈనెల 26లోపు అసోసియేషన్ కార్యాలయానికి పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985012181, 8885012181, 7730814646 నంబర్లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పైర్ సంస్థ కన్వీనర్ జిలాన్‌బాషా, కో–కన్వీనర్ గంగాధర్, ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి, ఏపీఎస్ఎఫ్ గురుసాయి, సూరి, సిద్ధు, పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాసన పోటీలకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటూ సాగే యోగాసన శిక్షణ బుధవారం వివిధ యోగా కేంద్రాల్లో ప్రారంభమైంది. వివేకానంద యోగకేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. జూన్ 21 వరకు వివేకానంద యోగా కేంద్రాలైన ఆర్ట్స్ కాలేజీ, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, జిల్లా పరిషత్తు హాలు, అశోక్ నగర్‌లోని సరస్వతీ విద్యామందిరం, రామనగర్ కమ్మభవన్, షిరిడీ నగర్‌లో వివేకానంద ప్రధాన కార్యాలయం, కోవూరు నగర్‌లోని విద్యారణ్య ప్రాంగణం తదితర చోట్ల ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 14, 15 తేదీల్లో యోగాసన పోటీలుంటాయని తెలిపారు. విజేతలకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం తరపున అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. ఆసక్తి కల్గిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా కేంద్రాలతో పాటూ 9963028694, 9441734555 నంబర్లలో సంప్రదించాలన్నారు.